గృహ సారథులపై బృహత్తర బాధ్యత

- ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించాలి
- ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ గృహ సారథుల భుజాలపై బృహత్తర బాధ్యత ఉందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ పరిధిలోని 1–38 వార్డులకు సంబంధించిన గృహసారథులతో సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరంగా తెలియజేయడానికి గృహ సారథులు నడుం బిగించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న చేస్తున్న మంచి వివరించి , సీఎంగా జగనన్న ఉంటేనే సంక్షేమ పథకాలు, మరింత మంచి ప్రతి గడపకూ చేరుతుందని ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ప్రజలకు మంచి చేయాలని మనస్సులేదు కానీ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డు కోవడానికి టీడీపీ నాయకులు ఎత్తులు వేయడం సిగ్గుచేటన్నారు.వచ్చే ఎన్నికల్లో 175 కి 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ గెలుపు తథ్యమన్నారు. కుప్పంతో పాటు హిందూపురంలో టీడీపీ మట్టికోటలను బద్దలు కొట్టి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

లోకేష్ పాదయాత్ర కాదు బలియాత్ర

లోకేష్ పాదయాత్ర చేస్తుంటే ఏ రోజు ఎవరికి ప్రాణగండమో తెలియడంలేదు. ఆయన పాదయాత్ర కాకుండా బలియాత్ర సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కోండూరు వేణుగోపాల్‌రెడ్డి విమర్శించారు. లోకేష్ వెంట జనం కరువు అవుతుంటే చంద్రబాబు, పార్టీ నాయకులు గుండేలు బాదుకుంటున్నారన్నారు. తమిళనాడు, ఇతర ప్రాంతాలను అద్దె జనాలను తరలిస్తూ అభాసుపాలు అవుతున్నారన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణను గెలిపించడం మనం చేసుకున్న దురదృష్టమన్నారు. శిక్షణా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో న్యాక్ బృందం పర్యటన

పావగడ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం పర్యటించింది. ఈ సందర్భంగా న్యాక్ చైర్‌పర్సన్ జి దేవశీశ్ భట్టాచార్య,డా రేఖాపాండె, డా మంజుశ్రీ బృందం కళాశాల పూర్తి వివరాలు సేకరించారు. కళాశాల అభివృద్ధి, అధ్యాపకుల పనితీరును తెలుసుకునేందుకు విద్యార్థినులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన జానపద వీరగాసి, లంబాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారప్ప, కళాశాల అభివృద్ధి సమితి పదాధికారులు మైలప్ప, సణ్ణరామిరెడ్డి, మారణ్ణ, కేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శుభకార్యం

గోరంట్ల: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి సోదరుడు సూర్యనారాయణరెడ్డి గృహ ప్రవేశ వేడుకలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

హిందూపురం టౌన్: స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆవిష్కరించారు. జిల్లాలో ఉర్దూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అసోసియేషన్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పఠాన్ ఇమ్రాన్, ఇమ్రాన్, మహమ్మద్ అన్సర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువులో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మహిళలు జ్యోతుల మహోత్సవం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాలు జరిగాయి. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

హిందూపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఏపీకి అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన అదాని గ్రూప్ కంపెనీ ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వినోద్‌కుమార్, ఇస్మాయిల్, కృష్ణ, ఫక్రుద్దీన్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి పాల్గొన్నారు.
లేపాక్షి: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు శుక్రవారం ఉదయం స్థానిక పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున

మడకశిరరూరల్: మండలపరిధిలోని జిల్లెడుగుంట ఎస్సీ కాలనీలో ఆర్డీటీ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శుక్రవారం ఆర్డీ మల్లికార్జున, సీడీపీఓ నాగమల్లేశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. బాలింతలు, గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆర్డీటీ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటీఎల్ నారాయణస్వామి, సూపర్‌వైజర్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ శివారులో ఉన్న బందార్లపల్లి గ్రామ పరిసరాల్లో శుక్రవారం పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.2,600 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

ఘనంగా శరణల జయంతి


నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: సమ సమాజ స్థాపనకు కాలి నడకన పర్యటించి, తమ కీర్తనలు, బోధనలతో కృషి చేసిన మడివాళ మాచిదేవ, అంబిగర చౌడయ్య, హడపద హప్పణ్ణ, కిన్నరి బ్రహ్మయ్య, గణేష్ మనణ్ణయ్య శివ శరణల జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ శరణల చిత్రపటాలకు తహసీల్దార్ వరదరాజు పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, గ్రేడ్-2 అధికారి మూర్తి తదితర ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్

పుట్టపర్తి: మద్యం, గంజాయి అమ్మకం, రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ అన్నారు. శుక్రవారం బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పాత కేసులను త్వరితగతిన విచారణ జరిపి చార్జ్ షీట్స్ వేయాలని సిబ్బందికి సూచించారు. పేకాట, మత్తు పదార్థాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలపై అత్యాచారానికి పాల్పడితే పోక్సో చట్టం మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. పోలీసులు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువతకు సూచనలివ్వాలని ఎస్ఐ నరసింహుడుకు సూచించారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

అమరాపురం: మండలంలోని గొడనకుంట ప్రాథమిక పాఠశాల, మెయిన్, డీపీఈపీ పాఠశాలలను ఎంఈఓ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్, ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్య ప్రణాళికలు, సిలబస్, విద్యార్థుల వర్క్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. కూరలో పప్పు దినుసులు, కంది బేడలు, నూనె, కూరగాయలు, ఆకుకూరలు తగిన మోతాదులో వేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొడిగుడ్డు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

హిందూపురం: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎం.ఈరన్న శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఇస్మాయిల్‌ను కొద్దిరోజుల క్రితం వీఆర్‌కు వెళ్లడంతో టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న ఈరన్నను వన్‌టౌన్ సీఐగా బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులివ్వడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

కంపచెట్ల తొలగింపు

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలను ఉపాధి కూలీలు తొలగించి పరిశుభ్రం చేశారు. పీహెచ్‌సీ పరిసరాలల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయని వైద్య సిబ్బంది గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ ఆదినారాయణ స్పందించి ఉపాధి కూలీల ద్వారా పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో డాక్టర్, కొంత మంది సిబ్బంది కనిపించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. కొంతమంది సిబ్బంది విధులకు హాజరుకాకపోయినా హాజరైనట్లు సంతకాలు చేసినట్లు గుర్తించారు. డాక్టర్ శివానంద్ అటెండెన్స్ రిజిష్టర్‌లో ముందురోజు (శనివారం) సంతకం చేసినట్లు తనిఖీలో వెలుగు చూసింది. మరి కొంతమంది సిబ్బంది కూడా ఇలాగే సంతకాలు చేసినట్లు ఎమ్మెల్యే గుర్తించారు. పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి బయట క్లినిక్ నడుపుతున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీలు కూడా చేయడం లేదన్నారు. కర్ణాటకలోని శిర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి.. డీఎంఅండ్‌హెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కర్ణాటక సరిహద్దులో ఉన్న అగళి పీహెచ్‌సీలో రోగులకు సరైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేజీబీవీ, మోడల్ స్కూళ్ల తనిఖీ..
అగళిలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహేంద్ర, నసీర్‌సాబ్, సతీష్, వెంకటస్వామి, హనుమంతరాయప్ప, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి..
రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బాలయోగి రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ముందుగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఏ-3 పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. భోజన శాల, తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెనూ ప్రకారం రోజు మూడు పూటల నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, అగళి మండలం నాయకులు మహేంద్ర, నటరాజు, దేవదాసు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపిత త్రిమూర్తి జయంతి


ఊరేగింపు నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

అమరాపురం: స్థానిక ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రజాపిత త్రిమూర్తి 87వ శివ జయంతి ఉత్సవాన్ని శుక్రవారం బ్రహ్మ కుమారీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వ విద్యాలయం నుంచి శివ లింగాలు, కుంభాలతో బ్రహ్మ కుమారీలు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, అర్చకుడు శ్రీనివాస్, మౌంట్ అబూ నుంచి వచ్చిన కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలన్నారు. ప్రతి మనిషికి ఇది చాలా అవసరమన్నారు. స్థానిక ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో నిత్యం భగవంతుని సేవ చేసుకుంటూ ధ్యానం చేయడం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మహేంద్ర, స్థానిక నిర్వహకురాలు పుష్పక్క, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బ్రహ్మ కుమారీలు పాల్గొన్నారు.

హోండా యాక్టివా స్మార్ట్ వెహికల్ లాంచింగ్


హూండా యాక్టివా స్మార్ట్ వాహనాన్ని లాంచింగ్ చేస్తున్న దృశ్యం

హిందూపురం: హోండా యాక్టివా స్మార్ట్ వాహనం కొత్త ఫీచర్స్‌తో సరికొత్తగా విడుదలైయ్యిందని యాక్టివా షోరూం ఎండీ నారాయణరెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని షోరూంలో యాక్టివా స్మార్ట్ వాహనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్త వాహనంలో సరికొత్త ఫీచర్స్ ఉన్నాయన్నారు. వాహనాన్ని పార్క్ చేసి లాక్ వేయకుండా పోతే లాక్ చేయలేదని గుర్తుచేస్తూ ఆటోమెటిక్ లాక్ అవుతుందన్నారు. ఇగ్నీషన్ సెక్యూరిటీ సిస్టంతో బెస్ట్ మెకానిజంతో పనిచేస్తుందన్నారు. వాహనం ఆరు రంగుల్లో అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ ప్రసాద్, షోరూం మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ


కల్లుకుంటలో విచారిస్తున్న డీఎస్పీ హుసేన్‌పీరా

రొద్దం: కల్లుకుంటలో ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడని ఓ యువతి ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. యువకుడు కల్యాణ్, అతని కుటుంబ సభ్యులు మారుతి, రత్నమ్మ, సిద్దప్ప తదితరులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయ్యింది. ఈ కేసుపై డీఎస్పీ హుసేన్‌పీరా, సీఐ కరుణాకర్ శుక్రవారం విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ఆదాయ వనరులు సమాకూర్చుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఆదాయ వనరులను సమాకూర్చుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. అలాగే కుళాయి, ఇంటి పన్ను తదితర వాటిని సక్రమంగా వందశాతం వసూలు చేయాలని సూచించారు. సచివాలయంలో ఏయే సేవలు అందిస్తున్నారు? ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారని ఆరా తీశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దాత సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ముంబాయి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ ఎంవీ రావు ఆర్థిక సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో తాగునీరు నీరు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యను సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఎంవీ రావుకు తెలియజేసి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి


హలుకూరులో డ్రమ్ములో నీటిని తోడేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అమరాపురం: గ్రామాల్లోని ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హలుకూరు సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది పర్యటించారు.
ప్రతి శుక్రవారం ఇంటిలోని పాత్రలను శుభ్రం చేసి, ఎండకు ఆరబెట్టాలన్నారు. అలాగే కుళాయిల వద్ద నీటి డ్రమ్ములు, తొట్టిలను శుభ్రం చేయాలన్నారు. కాలువలో పేరుకుపోయిన మురుగు నీటిని తొలగించాలన్నారు. పరిసరాలు బాగుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీజీ గోల్స్ పురోగతిపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథగుప్త

గోరంట్ల: మండలంలోని మందలపల్లి ఒకటో సచివాలయంలో ఎంపీడీఓ రఘునాథగుప్త సచివాయల ఉద్యోగులు, శిశుసంక్షేమ శాఖ అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బందితో ఎస్‌డీజీ గోల్స్ పురోగతిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎస్‌డీజీ గోల్స్‌లోని 17 అంశాలను అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు వివరించి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంచుకోవాలన్నారు.

ఇళ్లు నిర్మించాలని హమాలీల ఆందోళన


మార్కెట్ యార్డు కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పావగడ: తమకు ఇళ్లు నిర్మించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం హమాలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ సంచాలకుడు నాగరాజు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ఇళ్ల కోసం పోరాడుతున్నా స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య వైఖరితో ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సౌలభ్యాలు కూడా అందలేదన్నారు. ఈ సారి బడ్జెట్‌లో హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి, తాలూకా కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు, మార్కెట్ యార్డు కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు రామాంజినప్ప, మద్దిలేటప్ప, విహెచ్ రామాంజినప్ప తదితర 50 మంది హమాలీలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

హిందూపురం: స్థానిక బాలాజీనగర్‌లోని వెంకటరమణ స్వామి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఆంజనేయులు, ట్రెజరర్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'స్వమిత్వ' సర్వే పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్

సోమందేపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా 'స్వమిత్వ' భూసర్వే పకడ్బందీగా చేపట్టాలని డీపీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద డివిజన్ పరిధిలోని సర్వేయర్లు, రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులు అవగాహన కల్పించారు. డీపీఓ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో ఇళ్ల, ఇంటి చుట్టు పక్కల ఖాళీస్థలాలు, రోడ్లు తదితర ప్రభుత్వ భూముల కొలతలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో సర్వే పూర్తయి ఉంటే వాటి వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో వీఆర్వో, కార్యదర్శులు, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రహదారులకు మహర్దశ

పెనుకొండ రూరల్: పెనుకొండ కియా పరిశ్రమ రాకతో వాహనాల రద్దీ పెరిగింది. మడకశిర మీదుగా కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. వాణిజ్య సదుపాయాలకు అనువుగా ఉంటోంది. ఎమ్మెల్యే శంకర నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక చొరవతో పెనుకొండ రహదారులకు మహర్దశ కల్పించాలని సీఆర్ఎఫ్ నిధులతో హరిపురం జాతీయ రహదారి నుంచి పట్టణం మీదుగా కృష్ణదేవరాయల వైజంక్షన్ వరకు, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గొర్రెల పెంపకం క్షేత్రం వరకు రహదారుల నిర్మాణాలకు కృషి చేశారు. హరిపురం జాతీయ రహదారి నుంచి సోలార్ పరిశ్రమ వరకు దాదాపుగా 1.6 కి.మీ రూ.2.50 కోట్లతో, గత రహదారి కంటే మరింత వెడల్పుతో జాతీయ రహదారిని తలపించే విధంగా నిర్మించారు.


నూతనంగా నిర్మించిన రహదారి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు శనివారంవిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ చిలమత్తూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని వీరాపురం, వెంకటాపురం, లక్ష్మీపురం, కంబాలపల్లి, మరవకొత్తపల్లి, చిన్నన్నపల్లి, కొత్తచామలపల్లి, సంజీవరాయునిపల్లి, చిలమత్తూరు, చేనేపల్లి, టేకులోడు పంచాయతీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

లేపాక్షి మండలంలో..
లేపాక్షి: మండలంలోని 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని లేపాక్షి, కొండూరు, కంచిసముద్రం, చోళసముద్రం, నాయనిపల్లి, కుర్లపల్లి, కల్లూరు, బిసలమానేపల్లి, గలిబిపల్లి, గొంగటిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.